ప్రజాశక్తి
శనివారం 14 జనవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



గేదెలబందలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని డుంబ్రిగూడ ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గేదెలబంద ఉపకేంద్రం వద్ద బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి గ్రస్తులకు వైద్యాధికారి ప్రేమ, 104 వైద్యాధికారి సిద్ధార్థ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు గ్రామాల్లోనే అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. దీన్ని ప్రతి ఒక్క గిరిజనులు సద్వినియోగ పరుచుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్ ప్రభాకర్ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాఫీ కొనుగోలులో..

అవినీతిపై విచారణ చేపట్టాలి

▶▶గిరిజన సొసైటీ మ్యాక్స్ పేరుతో పాడేరు ఐటిడిఎ పిఒ అక్రమాలు ▶▶ఎపి గిరిజన సంఘం

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన రైతుల నుంచి ఐటీడీఏ ద్వారా మాక్స్ సొసైటీతో నిర్వహించిన కాఫీ కొనుగోళ్లలో భారీ అవినీతి అక్రమాలు జరిగాయని గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గిరిజన సొసైటీ పేరుతో అక్రమాలకు పాల్పడ్డ పాడేరు ఐటిడిఏ పిఒ మాక్స్ సొసైటీ నిబంధనలను పక్కనపెట్టి టెండర్ నిర్వహించి, మాజీ కాఫీ ఏడి భాస్కరరావుతో కలిసి తమకు అనుకూలమైన గుత్తేదారులకు 22 మెట్రిక్ టన్నుల కాఫీని చౌకగా అమ్మేశారని విమర్శించారు. గిరిజన సొసైటీ పేరుతో ఒక వెయ్యి 87 మెట్రిక్ టన్నుల కాఫీ సేకరణ జరిగిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ మూడు కోట్లు విడుదల చేసిందని, ఈ కాఫీ కొనుగోళ్లకు సంబంధించి పాడేరు ఐటిడిఏ పిఒ సాగించిన కాఫీ క్రయవిక్రయాలపై విచారణ నిర్వహిస్తే భారీ అవినీతి కుంభకోణం వెలుగు చూస్తుందని చెప్పారు. చింతపల్లిలో శుక్రవారం ఈ కాఫీ కొనుగోలు అవినీతి వ్యవహారంపై విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిసిసి అపెక్స్ కమిటీ సభ్యుడైన ఐటిడిఏ పిఒ గోపాలకృష్ణ కాఫీ రైతులకు మద్దతు ధర కల్పిస్తామని మ్యాక్స్ సొసైటీ పేరుతో గిరిజన రైతులకు తక్కువ ధర చెల్లించి కాఫీ కొనుగోలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్న వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి నష్టపోయిన రైతులకు నగదు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిసిసి మార్కెట్ ద్వారా కాఫీ రైతులను ఆదుకుంటామని, 2017లో అరకు కాఫీ ప్రాజెక్టుకు సుమారు రూ.520 కోట్ల బడ్జెట్‌తో ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులను కేటాయించి 2023 నాటికి ఐదు సంవత్సరాల కాలవ్యవధిలో గిరిజన రైతులను దళారీ దోపిడీల నుండి రక్షించి స్వయం సమృద్ధి సాధించే దిశగా కృషి చేస్తామని ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని, జిసిసి వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు బ్లాక్ లిస్టులో ఉన్న ఐసిఎస్‌డిసి అనే స్వచ్ఛంద సంస్థను తెరమీదకు తీసుకొచ్చి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారన్నారు. ఆనాటి అడుగుజాడల్లోనే గిరిజన కాఫీ రైతులతో విశాఖ ఏజెన్సీ గిరిజన కాఫీ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార పరిమితి సంఘం(మాక్స్ సొసైటీ)ఏర్పాటు చేసి ఐటిడిఏ పిఒ రోణంకి గోపాలకృష్ణ పెత్తనం చేస్తున్నారని విమర్శించారు.2022 సంవత్సరాలకు గాను మ్యాక్స్ సొసైటీ ద్వారా సుమారు పది లక్షల 80 వేల కేజీల కాఫీని సేకరించి రైతులకు మాత్రం రూ.40 చొప్పున నాలుగు కోట్ల 32 లక్షల 80 వేలు చెల్లించారని, సేకరించిన మొత్తం కాఫీని ప్రాసెసింగ్ చేయగా పార్చ్ మెంట్ ఒక లక్ష 80 వేల కేజీలు, చెర్రీ కాఫీ 41 వేల కేజీలు చొప్పున వచ్చిందని, నాడు జిసిసి ప్రకటించిన ధర ప్రకారం ఒక కేజీకి 10 రూపాయలు చొప్పున బోనస్ కింద మాక్స్ సొసైటీ రైతులకు తక్కువగా చెల్లించిందని, దీంతో రైతులు ఒక కోటి 80 లక్షల రూపాయలు నష్ట పోయారని తెలిపారు. చెర్రీ, పార్చ్ మెంట్ కాఫీ విక్రయాలకు ఓపెన్ టెండర్ చింతపల్లిలో నిర్వహించి తర్వాత ఐటీడీఏ కార్యాలయంలో రహస్యంగా పిఒ ఓపెన్ టెండర్ నిర్వహించకుండా మాజీ కాఫీ ఏడి భాస్కరరావుకు సన్నిహితుడైన వ్యాపారికి కేజీ పార్చ్ మెంట్ కాఫీకి కిలో రూ.294ల చొప్పున, కిలో చెర్రీ కాఫీకి రూ.100ల చొప్పున విక్రయించారని తెలిపారు. తమ గుత్తేదారుడుకు కాఫీ అప్పగించడంతో మాక్స్ సొసైటీ పొందిన సొమ్ము ఐదు కోట్ల 73 లక్షల 14 వేల నుండి కాఫీ పళ్ళు సేకరణకు రైతులకు చెల్లించిన సొమ్ము 4 కోట్ల 34 వేల 80 కాగా, రైతులు నష్టపోయిన సొమ్ము ఒక కోటి 38 లక్షల 34 వేలు అని అన్నారు. దీనిలో కాఫీ రైతులకు మద్దతు ధర లభించకపోగా నిలువు దోపిడీకి గురయ్యారని తెలిపారు. గత ఏడాది ప్రాసెసింగ్ చేసిన కాఫీలో, పార్చ్ మెంట్ కాఫీ 25 వేల కేజీలు తరుగు పేరుతో మాయం చేశారని, ఈ 25వేల కేజీల కాఫీకి గత ఏడాది గుత్తేదారుడు కిలో కాఫీకి రూ.294 చొప్పున చెల్లించిన ప్రకారం 73 లక్షల 50 వేలు స్వాహా చేశారని, ఈ సంవత్సరానికి గాను ఐదువేల మెట్రిక్ టన్నుల సేకరణకు 11 మండలాల్లో ఉన్న లైజన్ వర్కర్లకు టార్గెట్ ఇచ్చి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఐటిడీఏ పీవో నిర్ణయం మేరకు మాక్స్ సొసైటీ ప్రకటించిన కిలో కాఫీపళ్ళ కొనుగోలు ధర రూ.36 కాగా, జిసిసి, నాంది ఫౌండేషన్, ప్రకటించిన ధరతో పోలిస్తే ఒక కిలోకు రూ.14 తక్కువని తెలిపారు. సొసైటీ లక్ష్యం మేరకు ఐదు వేల మెట్రిక్ టన్నుల కాఫీ పళ్ళను ప్రాసెస్ చేస్తే సుమారు 850 మెట్రిక్ టన్నుల ఫార్చ్యూమెంట్ కాఫీ 250 మెట్రిక్ టన్నుల చెర్రీ కాఫీ ఉత్పత్తి అవుతుందన్నారు. ఐదువేల మెట్రిక్ టన్నుల కాఫీ రూ.36 చొప్పున చెల్లిస్తే 15 కోట్ల 30 లక్షలు ఖర్చు అవుతుందని ప్రాసెస్ చేసిన చెర్రీ పార్చ్మెంట్ కాఫీని బెంగళూరు మార్కెట్లో అమ్మితే సుమారు 29 కోట్ల 59 లక్షలు వస్తుందని మాక్స్ సొసైటీ సమకూర్చిన ఆదాయంతో పోలిస్తే 14 కోట్ల 29 లక్షలు, పళ్ళు సేకరణలో జిసిసి నాంది ఫౌండేషన్ ప్రకటించిన ధరతో పోలిస్తే నష్టపోయిన రూ.14 చొప్పున ఐదు మెట్రిక్ టన్నులకు గాను సుమారు 70 లక్షలతో కలిపి 2023 సంవత్సరంలో సుమారు 14 కోట్ల 99 లక్షలు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అపెక్స్ కమిటీ సభ్యులుగా పాడేరు ఐటీడీఏ పీవో కాఫీ మద్దతు ధరను ప్రకటించి రైతులను ఆదుకోవాల్సి న్నా ఒక ప్రైవేట్ సంస్థ మాక్స్ సొసైటీకి అన్ని తానై నడిపిస్తున్నారని విమర్శించారు. గిరిజన సొసైటీల పేరుతో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, గడుతూరి సత్యనారాయణ, సాగిన చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నయ్యపడాల్

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రంపచోడవరం

నవోదయ విశ్వవిద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. శు క్రవారం ఆయన స్థానిక ఐటిడిఏ కార్యాలయంలోని తన చాంబర్లో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ ఏడాది ఏప్రిల్ 29న రంపచోడవరం, కూనవరం, ఏటపాక మండల కేంద్రాలలో అర్హత పరీక్ష ఉంటుందని వెల్లడించారు. 3, 4 తరగతులు ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుకున్న వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. 2022-2023 విద్యా సంవత్సరంలో 5వ తరగతి పాస్ కావాల్సి ఉందని తెలిపారు. అభ్యర్థులు 2011 మే 1 నుండి 2013 ఏప్రిల్ 30వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www.navo-daya.gov.In ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తులు తీసుకువచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7668654709, 9705852243, 6300624049, 9948999589 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ నవోదయ దరఖాస్తుల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో సిహెచ్ శ్రీనివాసరావును ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు.



మాట్లాడుతున్న పిఒ సూరజ్ గనోరే



ఆర్థిక సాయం అందజేస్తున్న లోదొడ్డి గ్రామ సర్పంచ్ లోతా రామారావు

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

-రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోతట్టు పంచాయితీ లోదొడ్డి గ్రామంలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో జర్తా గంగ అనే గిరిజన మహిళకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ1.50 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. బాధితుల కథనం ప్రకారం... లోదొడ్డి గ్రామ శివారులో చేనుమకాల్లో నివాసం ఉంటున్న జర్తా గంగ కుటుంబం గురువారం రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో చలి నుండి ఉపశమనం పొందేందుకు లగడీలు వేసుకుని నిద్రపోయారు. ఈ నేపథ్యంలో దుప్పటికి నిప్పంటుకొని మంటలు వ్యాపించి ఇంటికి అంటుకున్నాయి. దీంతో గంగ కుటుంబీకులు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. మంటలను అదుపుచేసే అవకాశం లేకపోవడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో గంగ కుటుంబానికి చెందిన బట్టలు, ఫర్నిచర్, బీరువా, డబ్బులు తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లోతా రామారావు శుక్రవారం గంగ కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, కొంత డబ్బు ఆర్థిక సహాయం అందజేశారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన బాధితు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు పొత్తూరు లోవరాజు, బూసరి సత్తిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కందిపప్పు నాణ్యతపై ఆరా

ప్రజాశక్తి-పాడేరు:అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలల వసతి గృహాలకు, ప్రభుత్వం సరఫరా చేస్తున్న కందిపప్పు నాణ్యతను పరిశీలన చేస్తున్నట్లు అల్లూరి జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక గుడివాడ వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో కందిపప్పును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాలకు సరఫరా జరుగుతున్న కందిపప్పు ఉడక లేదని, నాణ్యత విషయంలో తేడా ఉందని వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలన చేస్తున్నామన్నారు. కందిపప్పును ఉడికించి కూడా చూసామని అందరి నుంచి బాగానే ఉన్నట్లు నివేదికలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌సి ఎస్‌సి లిమిటెడ్ డివిజనల్ మేనేజర్ గణేష్, వినియోగదారుల సంఘం ప్రతినిధి లకే నాని బాబు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



కందిపప్పును పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, పిఒ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు అందిస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఐటిడిఎ బిఆర్.అంబేడ్కర్ సమావేశ మందిరంలో 43 స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల 30 లక్షల చెక్కను పంపిణీ చేసారు. తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించి మరిన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, ఎల్ డిఎ రవితేజ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-చింతూరు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మండలంలోని కల్లేరు గ్రామంలో శుక్రవారం ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గులు, కుర్చీ ఆట, లెమన్ అండ్ స్పూన్ ఆట, బస్తా జంప్ ఆట్ల వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మహిళల అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి ముర్రం రంగమ్మ మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని సమాజంలో సగభాగం ఉన్న మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలు చైతన్యం పెంపొందించుకోవాలన్నారు. బిజెపి ప్రభుత్వ మతోన్మాద విధానాలపై మహిళలు ఐక్యంగా పోరాడాలన్నారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు కోసం, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ అమలుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు సోడె రాములమ్మ, మండల కమిటీ సభ్యులు సోడే కమల, సోడే చిన్నమ్మ, గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, సోడే రాఘవయ్య, సచివాలయ ఉద్యోగులు షోడే సౌజన్య, మడకం గ్రామస్తులు సోడే రాములమ్మ, కమలమ్మ, చిన్నమ్మ, రెడ్డి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ జెడ్‌పిటిసి రంగమ్మ తదితరులు



వాలీబాల్ కిట్ అందజేస్తున్న సిఐ అశోక్‌కుమార్

కోడి పందేలు, పేకాటపై కఠిన చర్యలు

ప్రజాశక్తి -సీలేరు : కోడిపందేలు, పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తప్పవని జీకే వీధి సీఐ జి.అశోక్ కుమార్, ఎస్ఐ కె.అప్పలసూరి హెచ్చరించారు. శుక్రవారం జీకే వీధి పోలీస్ స్టేషన్లో వారు విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాట ఆడ వద్దని, మానసిక శారీరక ఉల్లాసాన్ని పెంపొందించే వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడలను ఆడాలని యువతకి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యువ క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. పేకాట కోడిపందేలు వంటి వ్యసనాలకు అలవాటు పడితే ఆస్తులు, కోళ్ళు, మేకలు అమ్ముకుంటున్నారని తెలిపారు. పేకాట, కోడిపందేలు శిబిరాలపై నిఘా ఉంచి దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. పండగ పూట సరదాలు, సంతోషాలతో నిండాలే తప్ప విషాదలాతో ఉండకూడదని ప్రతి ఒక్కరు తాము ఉదహరించిన విషయాలను గ్రహించి జాగ్రత్తలు పాటించాలని కోరారు.



బొత్సకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

బొత్సకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విజయనగరంలోని తన స్వగృహంలో శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి. నర్సింగరావు కలిశారు. ఈ సందర్భంగా ఆదివాసి మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేసినందుకు మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరి జిల్లాలో విద్య పరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే చెందే జిఒ-3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత, టిడబ్ల్యూ ఆశ్రమ విద్యాలయాల్లో ఆరోగ్య కార్యకర్తల నియామకం, గిరిజన స్పెషల్ డిఎస్‌సితో పాటు తదితర సమస్యలను వివరించారు. అంతకుముందు మంత్రికి ఎమ్మెల్యే, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో వైసిపి నాయకులు ఎన్.మత్యకొండంనాయుడు, ఎస్.రామకృష్ణ, జి.సన్యాసి దొర, షేక్ నాగూర్ బాబు, పి.రామకృష్ణ, జి.ప్రసాద్ ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు గిరిజన సంఘం సాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చికిలింత పంచాయితీ పరిధి పెదగర్రంగి గ్రామంలో ఈనెల 11న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి వీధిన పడిన కాకూరి వెంకటరమణ కుటుంబానికి గిరిజన సంఘం నాయకులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. వెంకటరమణ తాటకిల్లు దగ్ధం అవడంతో ఇంట్లో సామగ్రి, ధాన్యం, బట్టలు, డబ్బులు ఖాళీ బూడిదయ్యాయి. ఈ నేపథ్యంలో వెంకటరమణ కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడింది. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, నాయకులు శుక్రవారం వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదు, బియ్యం, కిరాణా సామాగ్రి, బట్టలు, వంట పాత్రలు అందజేశారు. మరికొంత ఆర్థిక సహాయం అందజేసేందుకు కృషి చేస్తామని గిరిజన సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.సింహాద్రి, జె శ్రీనివాస్, బి విష్ణు, జె నూకరాజు, కె లోకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

భోగి మంటలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శనివారం తెల్లవారుజామున భోగి మంటలు వేయడానికి మెయిన్ రోడ్, లక్ష్మీగణపతి సెంటర్లోలో వర్తకులు సిద్ధం చేశారు. ప్రతి వీధిలోనూ పెద్దపెద్ద కర్రలను భోగి మంటలు వేసేందుకు ఏర్పాటు చేశారు. మరి కొంతమంది ఆవు పేడతో తయారు చేసిన పిడకలను భోగి మంటలు వేయడానికి సిద్ధం చేశారు. దీంతో శు క్రవారం నుంచే సీలేరులో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల మారుమూల గిరిజనులు సైతం భోగి, సంక్రాంతి పండగలను నిర్వహించేందుకు ముందస్తుగానే వారి వారి గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు మల్కనగిరి జిల్లా చిత్రకొండతో పాటు మారుమూల సరిహద్దు గిరిజనులు సైతం భోగి మంటలకు అన్ని ఏర్పాట్లు చేశారు.



లక్ష్మీగణపతి సెంటర్‌లో సిద్ధం చేసిన కర్రలు

ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం, సీలేరు జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరుకు ఇంటర్ బోర్డు కమిషనర్ హామీ ఇవ్వడం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులకు ప్రజాప్రతినిధులకు పరిస్థితి వివరించామని, ఇటీవల కాలేజ్ ఆవరణలో విద్యార్థులతో నిరసన కార్యక్రమాన్ని కూడా చేపట్టామని తెలిపారు. పాడేరు ఐటిడిఏ పిఒ రోణంకి గోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ చూపి విజయవాడ వెళ్లి ఇంటర్ బోర్డు కమిషనర్‌కు కలిచి కళాశాలకు పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయమని కోరగా కమిషనర్ హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు వి. అప్పారావు ఎం .సత్తిబాబు చెల్. శ్యామ్ సన్ (బుజ్జి) కారే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంబరాలు



పిల్లలపై భోగి పళ్లు పోస్తున్న పీడీ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని గుడివాడ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పట్టణ పరిసరాల్లోని 10 అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు పిల్లలందరినీ సమీకరించి వేడుకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రంగవల్లులుతో అంగన్వాడీ కేంద్రాన్ని అలంకరించి భోగి మంట వేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సూర్యలక్ష్మి చిన్నారులకు భోగిపళ్ళు, పుష్పాలు వేసి దీవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టీ ఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్ విటమిన్ బి12, విలువైన పోషకాలు ఉన్నాయని సూచించారు. ఈ బియ్యాన్ని వండేటప్పుడు, వార్చేటప్పుడు, చూసి ప్లాస్టిక్ బియ్యమని అపోహ పడవద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ ఆర్.శివప్రసాద్, డిఎం గణేష్, సిడిపిఓ, ఝాన్సీ రాణి, సూపర్వైజర్ రమణి, అంగన్వాడి కార్యకర్తలు భాగ్యలక్ష్మి, విజయ, జ్యోతి, ఛాయాదేవి, వసంత, అంబిక, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'గీతం' ప్రవేశాలపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్‌టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్. ఫార్మశీ), ఎమ్.ఆర్క్, మేనేజ్మెంట్, లా, సైన్స్, హ్యుమేనిటీస్, నర్సింగ్ పారామెడికల్ కోర్సులలో 2023 విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై నగరంలోని కళాశాలల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, గీతం స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర, అడ్మిషన్ల విభాగం పర్యవేక్షక అధికారి జగదీష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)-2023 పేరిట దేశవ్యాప్తంగా 134 కేంద్రాలలో ఆన్‌లైన్‌లో నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు గీతం ప్రాంగణాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికిస్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు. గీతం ప్రవేశ పరీక్షలోనూ, జెఇఇ మెయిన్స్ జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలోనూ, ఎపి ఇఎపి సెట్, తెలంగాణ ఎంసెట్ ప్రవేశపరీక్షలతో పాటు జాతీయస్థాయి పోటీ పరీక్షలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఫీజులో రాయితీ అందిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి కొత్తగా గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసారు.

డిసిఎంఎస్ బిఒఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

ఉత్తర్వులు అందజేసిన ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి ఈ మేరకు నియామక ఉత్తర్వులను స్వీకరించారు. అనంతరం విభాగంలో బిఒఎస్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఎయు డాక్టర్ విఎస్.కృష్ణా గ్రంథాలయం లైబ్రేరియన్‌గా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

పాడేరులో సంక్రాంతి సందడి

కొనుగోలుదారులతో షాపులు కిటకిట
జన సందోహంగా మెయిన్ బజార్ రోడ్డు



జన సందోహంగా మారిన కింద బజార్ మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా అవసరమైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని పలు ప్రాంతాలు శుక్రవారం రద్దీగా మారాయి. పట్టణంలోని ప్రజలతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కొనుగోలుదారులతో గత రెండు రోజుల నుంచి వాణిజ్య, వ్యాపార సముదాయాల ప్రాంతాలు సందడిగా మారాయి.



వస్త్రాలు కొనుక్కుని ఇంటికి వెళుతున్న గిరిజన కుటుంబం

కొనుగోలుదారులతో వస్త్ర, బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. గృహోపకరణాలు, కిరాణా షాపుల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. పట్టణంలోని మెయిన్ బజార్ (కింద బజార్) రోడ్డు జన సందోహంగా మారింది. వస్త్రాలు, బంగారు నగలు, కిరాణా సామాగ్రి గృహోపకరణాలు కొనుగోలు చేయడానికి ప్రజలు గత రెండు రోజుల నుంచి పట్టణంలోని ఆయా దుకాణాలకు క్యూ కడుతున్నారు. బట్టల దుకాణాలు ఉదయం తెరిచినప్పటి నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో రద్దీగా ఉంటున్నాయి. చిన్న షాపులతోపాటు పుట్ పాత్ లోని దుకాణాల్లోనూ రద్దీగా ఉంటుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వ గ్రామాలకు, సుదూరంలో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసి కాంప్లెక్స్ కిటకిట లాడుతోంది. దీంతో, జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో సంక్రాంతి సందడి నెలకొంది.

ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి

కలెక్టర్ సుమిత్ కుమార్



అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పని సరిగా ముఖ హాజరు వేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా అధికారులందరూ ముఖ్య హాజరు నమోదు ప్రక్రియను అన్ని శాఖలలో అమలు చేయాలన్నారు. శుక్రవారం ఐటిడిఏ కార్యాలయం బిఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవతో కలిసి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 31 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖలపై 96 రిట్ పిటిషన్లు ఉన్నాయని, శాఖాధిపతులు ఈనెల 20వ తేదీలోపు కౌంటర్ఫైల్ దాఖలు చేయాలని సూచించారు. ఆదేవిధంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు.

అర్జీలు కొన్ని...

హుకుంపేట మండలం కొట్నాపల్లి గ్రామ పంచాయతీ బొర్రా బాబూరు గ్రామస్తుడు జి.కొండబాబు బిసాయి పుట్టు నుండి బొర్రా బాబూరు గ్రామానికి రోడ్డు నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పెదబయలు మండలం సీకరి పంచాయతీ వెలపాలెం గ్రామస్తులు కిముడు రాధ, కిముడు రంభ తదితరులు అటవీ హక్కుపత్రాలు మంజూరు చేయాలని కోరారు. డుంబ్రిగుడ మండల కేంద్రానికి చెందిన శెట్టి గోపాల్ డిగ్రీ చదువుకుని నిరుద్యోగిగా ఉన్నానని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద టికెట్ కౌంటర్లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశారు. హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీ పందిమెట్ట గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని పాంగి కేశవరావు అర్జీని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో పి.కొండలరావు, డిఎంహెచ్ఓ జమాల్ భాషా, ఎడిఎంహెచ్ఓ లీలాప్రసాద్, డిటిడబ్ల్యు ఇఇ డి.వి.ఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పిఆర్ ఇఇ కొండయ్య పడాల్, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ లీలాకృష్ణ, డిఎల్ పి.ఓ. ఎస్ కుమార్, ఆర్అండ్బి ఇఇ బాల సుందర బాబు, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని పాల్గొన్నారు.

గిరిజనులకు సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలోని గిరిజన ప్రజలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతీ ఒక్కరూ కుటుంబాలతో కలిసి ఆనందంగా సంక్రాంతి పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్‌టిసి స్థలం లీజుపై
పునరాలోచించాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: ప్రజల ఆమోదం లేకుండా నర్సీపట్నం ఆర్టీసీ లీజు స్థలంలో అంగుళం కూడా నిర్మాణం జరగదని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గురువారం ఆయన విడుదల చేసిన వీడియోలో ఈ విధంగా మాట్లాడారు. ఆనాడు టీడీపీ హయాంలో షాపింగ్ కాంప్లెక్స్ కట్టడానికి చంద్రబాబు సమయంలో నిర్ణయం తీసుకున్నారని, తాను అప్పుడు మంత్రిగా ఉన్నప్పటికీ అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ కడితే రద్దీ పెరుగుతుందని, ప్రజలు ఇబ్బందులు పడతారని విభేదించి నిలుపుదల చేయించినట్లు తెలిపారు. ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద నాలుగు థియేటర్లు, పెట్రోల్ బంక్, దుర్గమ్మతల్లి ఆలయం, బ్యాంకులు, ప్రైవేటు పాఠశాలలు చాలా ఉన్నాయని, దీంతో ఇక్కడ నిత్యం రద్దీ పెరిగి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కనీసం నర్సీపట్నంలోని పెద్దలు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, అన్ని పార్టీల నాయకులతో మాట్లాడి ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. దీనిపై ఆర్టీసి అధికారులు పునరాలోచించి నర్సీపట్నం ఆర్డీవో సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి అన్ని ప్రజా సంఘాలు, నాయకుల అభిప్రాయాలు తీసుకొని నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ప్రజల అభిప్రాయం తీసుకోవాలి: జనసేన

ప్రజాశక్తి- నర్సీపట్నంరూరల్: నర్సీపట్నం మున్సిపాలిటీ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ఆర్‌టిసి స్థలం లీజుకు అధికారులు టెండర్లు ఆహ్వానించడం సరైన నిర్ణయం కాదని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆర్టీసి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఈ ప్రాంతం అత్యంత రద్దీగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలోని ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు.

ప్రజాగర్జన సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజాగర్జనను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద స్టీల్ సిఐటియు కార్యకర్తల సమావేశంలో ప్రయివేటీకరణ నుంచి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ తిరుమల పాదయాత్ర చేసిన ట్రాఫిక్ విభాగం రామారావు, బ్లాస్ట్ ఫర్నెస్ సైనిబాబులను సన్మానించారు.

ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నేడు రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు విడివిడిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. అలాకాక వారందరూ ఒకేవేదికపైకొచ్చి ప్రయివేటీకరణపై వ్యతిరేకగళాన్ని ఒక్కటై వినిపించాలన్న సంకల్పాన్ని 30న ప్రజాగర్జన విజయవంం చేయడం ద్వారా కేంద్రానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ ఉద్యమాన్ని ప్రజాఉద్యమంగా మార్చడం కోసం ప్రతి ఒక్క కార్మికుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, పుల్లారావు, గంగాధర్, కెవి సత్యనారాయణ, నీలకంఠం, డిసిహెచ్‌జవెంకటేశ్వరరావు, బిఎన్ మధుసూదన్, శ్రీనివాసులురెడ్డి, వీరస్వామి, రామన్న, సూర్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్షులు కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు..

20 నుంచి ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో

ప్రజాశక్తి -గాజువాక : ఈనెల 20, 21 తేదీల్లో గాజువాక ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఇ-2023 ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు వాసవీ అధ్యక్షులు ఎకె.బాలాజీ తెలిపారు. శుక్రవారం గాజువాక ఆటోనగర్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఏటామాదిరిగానే ఈ ఏడాది కూడా ఆటోనగర్‌లో వాసవి ఆధ్వర్యంలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా వివిధ పరిశ్రమ యజమానులు తమ ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను ఎంఎస్ఎమ్ఇ అధికారులు వివరిస్తారన్నారు. సెక్రటరీ వినోద్, అధ్యక్షులు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విశాల ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమం విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ విశాల ఉద్యమంగా మారిందని సిఐటియు కంచరపాలెం జోన్ అధ్యక్షులు బి.సింహాచలం తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 653వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ కార్మికులు కూర్చున్నారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదంటూ ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో ఇప్పటికే నిరసన కార్యక్రమాలు, దీక్షలు సాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 30న స్టీల్ ప్లాంట్ వద్ద అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. దేశానికి ప్రధాన మంత్రులుగా పనిచేసిన వారందరూ ఏదో ఒక భారీ పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారని, మోడీ ప్రధాని అయ్యాక ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమను ఏర్పాటు చేయలేదు సరిగదా ఉన్నవాటిని అమ్మకానికి పెట్టారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ దుర్మార్గ చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జోన్ నాయకులు ఎస్.రామ్‌గోపాల్, పాండు, వి.మహేశ్వరి, వి.నరసమ్మ, వి.భూలోకమ్మ, గౌరమ్మ, ఎయు మాజీ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

సంక్రాంతి వెలుగులు నింపాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నూతన సంవత్సరంలో వస్తున్న మకర సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో వెలుగును, సంతోషాన్ని, ఆనందాన్ని నింపాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. శుక్రవారం మద్దిలపాలెంలోని వైసిపి నగర కార్యాలయంలో జరిగిన సంక్రాంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి ఆవశ్యకతను తెలియజేశారు. జగనన్న పాలనలో రాష్ట్రంలోని రైతులు సుభిక్షంగా వున్నారని, కరోనా కష్ట కాలంలో కూడా రైతులకు ఏ లోటూ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుందని తెలిపారు. వైసిపి జిల్లా అధ్యకులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండగని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథ్, రవి రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భోగి మంట వేసి పార్టీ మహిళా విభాగం కార్యకర్తలు సంక్రాంతి పాటలు పాడారు.

నిరుపేదలకు సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సంక్రాంతి సందర్భంగా 50 నిరుపేద కుటుంబాలకు చారిటీ బాక్సు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యంతోపాటు 15 రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. తాటిచెట్లపాలెంలోని గ్రీన్‌బెల్ట్, పాత పోస్టాఫీసు, ఎంవిపి కాలనీ, పెదవాల్తేరు, బీచ్ రోడ్డు, మల్కాపురం తదితర ప్రాంతాలలో ఎంపిక చేసిన నిరాశ్రయులకు వీటిని అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధి చెక్కా రమాదేవి మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో ఉత్సాహంగా ఈ పండగను జరుపుకుంటారని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా పండగ మూడు రోజులూ అందరూ ఆనందంగా గడుపుతారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని దయనీయంగా జీవనం గడుపుతున్న కుటుంబాలను ఎంపిక చేసి ఈ నిత్యావసరాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో చారిటీ బాక్సు ప్రతినిధులు దౌలూరు శంకరరావు, టి.కరుణాకర్, వురిటి శ్రీనివాసరావు, మదీనా బీబీ, లక్కోజు సాయికుమార్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి రద్దీ

- కిక్కిరిసిన షాపింగ్ మాల్స్
- జనంతో నిండిన విశాఖ రహదారులు
- ఆర్‌టిసిలో సాధారణం కంటే 30 శాతం ప్రయాణాలు పెరుగుదల




కిక్కిరిసిన పూర్ణా మార్కెట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సంక్రాంతి.. ప్రజల్లో సందడిని పెంచే పండగ. వారం రోజుల ముందు నుంచే ఈ పండగకు రాకపోకలు మొదలైపోతాయి. ప్రయాణాల హడావుడిలోనే సమస్త జనం ఉంటారు. రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సాధనాలు, షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాలు రద్దీగా మారిపోతాయి. ఈ క్రమంలోనే శుక్రవారం విశాఖలోని షాపింగ్‌మాల్స్ అన్నీ వచ్చి పోయే జనాలతో కిక్కిరిసిపోయాయి. కేవలం బట్టల వ్యాపారాలే రూ.వేల కోట్లకు చేరుకోనున్నాయని తెలుస్తోంది. మరోవైపు నగర రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారూ ఏటా పెరుగుతున్న సంగతి తెలిసిందే. గత రెండేళ్లు కోవిడ్ వాతావరణం అలుముకోవడంతో పెద్దగా సంక్రాంతి సందడి కానరాలేదు. ఈ సంవత్సరం కోవిడ్ భయానక పరిస్థితులు లేనందున జనం తమ తమ అవసరాల కోసం మార్కెట్లలోకి వెళ్లి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకోవడం కనిపించింది.

ఆర్టీసీలో మామూలు రోజుల కంటే 30 శాతం ప్రయాణాలు పెరిగాయి. రైల్వేలో మామూలు రోజుల్లో 35 వేల మంది విశాఖ నుంచి ప్రయాణం చేస్తుండేవారు. గడచిన రెండు రోజులుగా రోజుకు 55 వేల మంది రైళ్లలో విశాఖ నుంచి వెళ్తున్నారు. 10 జతల కొత్త రైళ్లను సంక్రాంతి సందర్భంగా విశాఖ నుంచి రైల్వే నడుపుతోంది. ఈ నెల 10వ తేదీ నుంచి బట్టల షాపులన్నీ కళకళలాడుతున్నాయి. అంతకు ముందు బంగారం షాపులు, మార్కెట్‌లోని గ్లోసరీస్, చెప్పులు, ఇతర ఫర్నీచర్, గృహోపకరణాల దుకాణాల్లో ఈ సందడి కనిపించింది. గతంతో పోల్చితే ఈ వ్యాపారాలు బాగా జరిగినట్లు నగరానికి చెందిన పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఇదివరకూ కరోనా వల్ల వ్యాపారాలు వెనకపట్టుపట్టినా ఈ ఏడు మాత్రం అన్ని రకాల వ్యాపార లావాదేవీలు ఊపందుకున్నట్టు తెలుస్తోంది. బట్టల షాపుల్లో ధరలు ఆకాశాన్నంటినా సరే.. జనం వాటికోసం పోటా పోటీగా నగరంలోని ప్రధాన షాపింగ్‌మాల్స్‌లో షాపింగ్ చేయడం కనిపించింది. 14వ తేదీన భోగి అయినప్పటికీ కొనుగోళ్లు సాగుతాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఆ తరువాత సంక్రాంతికి ప్రజానీకమంతా తమతమ స్వస్థలాలకు వెళ్లనుండటంతో పట్టణం బోసిపోనుంది.



ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో జన రద్దీ

భోగి మంటలో జిఒ 1 కాపీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంట వేసి జిఒ నెంబరు 1 కాపీలను ఆ మంటలో తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు మాట్లాడారు. చీకటి జిఒను రద్దు చేయాలన్నారు. పార్టీ దక్షిణ నియోజవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు లొడగల కృష్ణ, ఆరేటి మహేష్, ఉపాధ్యక్షులు వి.చంద్రశేఖర్, వాండ్రసి అప్పలరాజు, పైలా ముత్యాల నాయుడు, తోట రత్నం, మొల్లి లక్ష్మణ, జిల్లా నాయకులు ఎర్నాగుల జగదీష్, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.



జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మొట్టమొదటిసారిగా విశాఖలో ఏర్పాటు చేసిన వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్‌ను బీచ్ రోడ్‌లోని ఎయు గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. పిల్లలతో కలిసి ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్‌లో ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందిన దేశాల్లో ఉన్నటువంటి ఎంతో ఖరీదైన చేపలను, సముద్ర గర్భంలో కంటికి కనబడని జీవరాశులను తెచ్చి అందుబాటులో ఉంచారన్నారు. రంగురంగుల మత్స్య సంపద అండర్ వాటర్‌లో కనువిందు చేయడం ఇక్కడి ప్రత్యేకతన్నారు. నిర్వాహకులు రాజారెడ్డి ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ విశాఖ వాసులను విపరీతంగా ఆకట్టుకోనుందని తెలిపారు. జెయింట్ వీల్, హార్స్ రైడింగ్, డ్రాగన్ ట్రైన్ వంటివి కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని మూడు నెలలపాటు సబ్ మెరైన్ ఎదురుగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు రాజారెడ్డి మాట్లాడుతూ ఎంతో ఖరీదైన, ఆకర్షణీయమైన చేపలను ఈ అక్వేరియంలో ప్రదర్శనకు ఉంచామన్నారు. చేనేత వస్త్రాలు, వివిధ రకాల వందలాది స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ కోర్టులు, వివిధ రాష్ట్రాలకు చెందిన గృహోపకరణ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. విశాఖవాసులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపేయండి

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటును నిలుపుదల చేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి డిఇఒ కార్యాలయంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈలోగా ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు చేస్తామని, గతంలో ప్రమోషన్ కోసం అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులను హైస్కూళ్లలో సర్దుబాటు చేసి వారికి రూ.2500 చెల్లిస్తామని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జనవరి 20 తర్వాత అపాయింట్‌మెంట్ తీసుకున్న ఉపాధ్యాయులకు కొత్త స్థలాల్లోనే జీతాలు చెల్లిస్తామని విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ కలెక్టర్ల సమావేశంలో చెప్పారన్నారు. విద్యాశాఖ కమిషనర్, పిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు భిన్నంగా ఉన్నందున ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళంలో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి సెలవుల అనంతరం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి స్పష్టత వచ్చిన తర్వాత పూర్తి స్థాయి ప్రమోషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకర్‌రావు, డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.మధు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి జోగా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.